వరస మంచాలు మావి. మధ్య నేను, అటు ఇటు వాళ్ళిద్దరు. ఇవతల పిల్ల వందన. అవతలామె సరస్వతి. వాళ్ళేం మాట్లాడుకున్నా, ఏం చేసినా నాకు స్పష్టంగా తెలుస్తుంది. ఆదమరచి నిద్రిస్తే తప్పు.

నేనీ వార్డులోచేరి రెండ్రోజులవుతోంది. వందన వచ్చి నాలుగోరోజు అని తెల్సింది. సరస్వతీ అంతే. ఆ భగవంతుడి దయవల్ల నేను వచ్చిన నాలుగో గంటకే సుఖంగా ప్రసవించాను. నేనూ, నా కొడుకూ కులాసాగా వున్నాం. అతనూ, మా బంధువులు వస్తూ, వెళ్తూనే వున్నారు. మాకే చికాకూ లేదు.

ఉన్న సమస్యలు, చింతలూ ఆ రెండు మంచాల దగ్గరే కనిపించేయి నాకు.

వందనకి పదిహేడేళ్ళుంటాయి. ఎర్రగా వుంది. ఏపుగా వుంది. మొహం మాత్రం లేత వయసుని చాటి చెప్తోంది. ఆ పిల్ల తన మంచ మ్మీద కుదురుగా ఒక్క నిమిషం సేపు పడు కోవడం లేదు. అస్థిమితంగా కదులుతోంది లేస్తోంది, కూచుంటోంది. పక్కకి చూస్తో చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటోంది. వెక్కిళ్ళు పడుతోంది. "నా కొడుకు...నా కొడుకు..." అని మూలుగుతోంది.

వందన మంచం పక్కనే వుయ్యాల వుంది. అందులో వందనని పోలివున్న ఆమె బాబు నిద్రపోతున్నాడు. వాడివంక చూస్తూ వందన రాగం పెట్టినప్పుడు, ఒక్క కసురు కసురు తోంది పూర్ణిమ.

ఆవిడ వందన మంచం పక్కనున్న బల్ల మీద కూచుని వుంటోంది. బాగా ఎత్తుగా, బాగా వెడల్పుగా వున్నదావిడ. పసుప్పచ్చటి ఒళ్ళు, నోట్లో కారా కిళ్ళీ, గార పట్టిన పళ్ళు, అమ్మ వారిలాగా నుదిటిన పెద్ద రూపాయి కాసంత కుంకుమ బొట్టు.

పూర్ణిమ మాటలని బట్టి, ఆవిడ వందనకి గార్డియన్ అని బోధపడింది నాకు.

"వెధవ ఏడుపాంపిక: పాడు ఏడుపు: దరి ద్రం ఏడిస్తే: ఏడ్చి ఏడ్చి ఇంతదాకా తెచ్చావ్: నాకు శనిలా దొరికేవు: ఏడ్చేవంటే పీక నొక్క గల్ను:" అని గదమాయిస్తోంది:

వందన ఏడుపులో దైన్యం వ్యక్తమవుతోంది. వందన వదనంలో, దుస్తుల్లో, ఆకృతిలో లేమి, నిస్సహాయతా వ్యక్తమవుతున్నాయి.

పూర్ణిమ గదమాయింపులో, కసుర్లలో అధి కారం వున్నది. ఆవిడ వేషధారణ ధనికురాలని గట్టిగా చెప్తోంది.

రోజులో మూడువంతులు పూర్ణిమే వంద నని కనిపెట్టుకొని వుంటోంది. వందనికి అవసర మైనవన్నీ ఆవిడే సమకూర్చుతోంది ఉదయం. సాయంత్రం పూర్ణిమ భర్త వస్తున్నాడు. సన్నగా, నల్లగా బాగా పొడవుగా వున్నాడతను. హైరోడ్డు క్రాపింగు, మూతిమీద ఈగ వాలినట్టున్న మీసం. భార్యభర్తలిద్దరికీ వృద్ధాప్యం ఛాయలింకా ప్రవేశించలేదుకాని, అతను మాత్రం ఆవిడకి తమ్ముళ్ళా కనిపించక మానడం లేదు.

అతని పేరు నరహరి అని నర్స్, పూర్ణిమ నడిగి పిలుస్తున్నప్పుడు నాకు తెల్సింది. నరహరి భార్య పూర్ణిమతో మొహమాటంగా నంగిరిగా మాట్లాఢుతున్నాడు. నర్సుతో, స్టాఫ్‌తో, లేడీ డాక్టర్‌తో, ప్రక్కనున్న మరొకామె సరస్వతితో, ఇటు నాతో, వందనతోనూ చనువున్నవాడిలా పరిచయం పెరిగినవాడిలానూ 'సంభాషిస్తాడు. అయితే పూర్ణిమ తనవైపు తీక్షణంగా చూపి నప్పుడు మాత్రం తప్పు చేసినవాళ్ళా తలొంచు కుంటున్నాడు.

నాకు మొదట్నించీ మానవ స్వభావాన్ని పరిశీలించడం అంటే చాలా ఇష్టం. నరహరిని స్టడీ చేస్తే అతనికి భార్యకంటే మిగిలిన స్త్రీ లంటేనే మక్కువ ఎక్కువని తెల్సింది: భార్య దగ్గర బెదుర్గూ, భయమే, అతనికి మిగిలిన స్త్రీల మీద ఇష్టంగా రూపుదాల్చు తోందని పించింది:

ముఖ్యంగా వందన మంచం దగ్గరికతను వెళ్ళినప్పుడు, పూర్ణిమ అతడిని ఒక పెద్దపులి చూసినంత క్రూరంగానూ ఒక నాగుపాము బుసకొట్టేంత కసిగానూ, బుసకొడ్తోండడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆ విధంగా ఆవిడ తన భర్తని అదుపులో పెట్టుకున్నా ననుకుం టోందా?' అని అనుకున్నాను.

వందన ఏడుస్తూంది.

"నోరుముయ్యే: ఎధవ ముఖవా:" కసిరింది పూర్ణిమ

వందన వూరుకోలేదు.

"నాకొడుకు... కొడుకు..." అంది.

"షటప్." అని గర్జించింది పూర్ణిమ. "కొడు కుట. కొడుకు వాడి వూసెత్తకు: నరికి పోగు లెడతాను. దిక్కుమాలిందానా: దీని ముఖానికి కొడుకు ఒకడు కావాలట: సిగ్గు లేకుంటే సరి: ఇదిగో నోరెత్తేవా నిన్ను సంపుకుతింటా:..."

ఆ పక్కనించీ వెళ్ళే నర్సులూ, స్టాఫ్, ఆయా, మిగిలినవాళ్ళూ ఆ వైపు విస్మయముగా చూస్తున్నారు.

"ఏవండీ? ఎందుకట్లా తిడుతున్నారామెనీ? ఆపిల్లేగదా మొన్న ప్రసవించిందీ? ఆమె బిడ్డ నామె తలుచుకుంటే అట్లా అంటున్నారేమి?" అంది స్టాఫ్ నర్సు ఆశ్చర్యముతో.

"మీకు తెలియదమ్మా. మీరూర్కోండి. మీ పనేదో మీరు చూసుకోండి. మా గొడవ మీకు తెలియదు. ఈ పిల్ల ఎలాంటిదో మీకేం తెలుసు? నాకు తెలుసు. నేను దీన్ని పదేళ్ళ గుంట కాణ్ణించీ పెంచేను గనుక; నాదగ్గరుండేదిగనకా, దీని బరువంత నేనే మోసేను గనకా నాకు తెల్సు. మీకేంతెల్సు?"

ఇలా పూర్ణిమ అనే సరికి, ఏమనుకున్నదో స్టాఫ్ నర్స్ వెళ్ళిపోయింది. చాలా మంది పేషెంట్లు కలిగించుకోడం మానివేశారు. నాకు మాత్రం ఆ వుబలాటం పోలేదు. మధ్యన వున్నాను గనుక, ఎంత పట్టించుకోకూడదను కున్నా, నా కళ్ళల్లో, చెవుల్లో పడుతోనే వున్నాది వాళ్ళ గొడవ గనక.

నాకు పూర్ణిమ దారుణంగా కనిపించింది. ఆవిణ్ణి దగ్గిరికి పిలిచేను.

"పూర్ణిమగారూ:" అని మృదువుగా సంబో ధించేను.

ఆవిడాపిలుపుతో నెమ్మదిగ వచ్చి, నా కొడు కున్న వుయ్యాల దగ్గర నిలబడి, వాణ్ణిచూస్తూ ఇలా అన్నది: "దేనికయినా ఒక అర్హత వుండాల-



# అపశ్రుతి

శివల జగన్నాథరావు

ఏ పని చెయ్యడానికయినాను. లేకపోతే చెట్టు కొట్టే మీదేసుకున్నట్టే. చూడండమ్మా. కనేస్తే సరిపోద్దా? ఆడదయినంత మాత్రాన అమ్మయి పోయినట్టేనా? అమ్మవడానికెంత అర్హతుం డాల? ఆ గుంటకేటుంది?''

''మీరాపిల్లని ఎందుకు తిడుతున్నారు?'' అడిగేను.

పూర్ణిమ కన్నింతా, గుడ్డంతా చేసిందా మాటకి.

''ఎందుకా? నాకు దాన్ని తిట్టే అధికారం వుంది గనకా. దాన్తో నేనెన్ని చావుల్సస్తన్నానో మీకేం దెల్సు? మీకెందుకన్నీజెప్పాల? మీరేం ఆర్చేవోళ్ళా? తీర్చేవోళ్ళా? మా పాట్లేవో మాయి. పడనీండి ...'' అని గబగబా వెళ్ళి పోయింది.

పూర్ణిమ నోరు ఒక పూరు. ఆవిణ్ణి విమ ర్శించే హక్కు నాకూ, ఈ హాస్పటలుకే కాదు. పూరు మొత్తానికే ఆ దమ్ము లేదు. అను కున్నాను నీరసంతో.

పూర్ణిమ ఏమీ చెప్పకపోయినా, ఆవిడ తిట్లూ, వందన వైఖరీ కలిసీ, నాకేదో అన్సరు చెప్పేయి.

ఆ సాయంత్రం చీకటి పడుతూంటే పూర్ణిమ బాత్రూంకి వెళ్ళిన సమయంలో, వందన మంచం మీంచి లేచింది. ఉయ్యాల దగ్గరికి వెళ్ళింది. తన బాబుని వొంగి తనివితీరా చూసుకొంది. ఏమిటో మెల్లిగా గొణిగింది, వాడికి చెబుతోన్నట్టు. వందన కళ్ళల్లోంచి టప టపా నీటిచుక్కలు పసివాడిమీద వానయి పడినాయి. ఆ వర్షానికి వాడు తట్టుకో లేకపోయేడేమో. రాగం తీశాదు. అంతలో బాత్రూంలోంచీ పూర్ణిమ వచ్చింది.

"ఏమిటే? ఏమిటి చేస్తున్నావు ఇక్కడ? ఎందుకు వచ్చేవు?" అని అడిగింది.

"పాలిద్దామని..."

"అక్కర్లేదు: నీ ఏడుపుగొట్టు పాలు వాడికక్కరలేదు. వెళ్ళి పడుకోతిన్నగా."అని, లాకర్ తలుపు తెరిచింది. పాలబుడ్డీ, పాలపౌడర్ టిన్నూ తీసి, ఫ్లాస్కులోంచి వేన్నీళ్ళు ఒంపి, పౌడరు కలిపి, పాలని బుడ్డిలోకి పట్టింది. బాబు నోట్లో పెట్టింది.

వందన అటు నిస్సహాయంగా చూస్తోంది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. ఆమె పాలగుండెలు వర్షిస్తున్నాయి. ఆమె కనులూ గుండెలూ కూడా ఫెళ్ళున వుబికేయి. జాకెట్టు తడిసింది. చీరె తడిసింది. అప్పుడు పూర్ణిమ నాకు పూతన లాగా కనబడ్డది.

రాక్షసత్వం రూపుదాల్చిన ఆవిడ, కోరలూ, కొమ్ములూ లేకుండానే ఆ పిల్లని బాధిస్తోంది:

రాత్రివేళ పూర్ణిమ వందన మంచం పక్కనే తను తెచ్చుకున్న ఖరీదైన బొంతలాంటి దేసుకుని ఎయిర్‌పిల్లో వేసుకుని పడుకుంటోంది. అప్పుడుకూడ ఆవిడ వందనికి స్వేచ్ఛని, తన

## మనసు

ఆశను గిల్లి
అధైర్యాన్ని పల్లి
చీకటి సముద్రాన
ముంచేస్తుంది 'మనసు'

-శర్మ...సి హెచ్

పిల్లకి పాలిచ్చుకొనే స్వేచ్ఛని, అవకాశాన్నివ్వటం లేదు. ఎంత పగ? అంత పగబట్టడానికి, ఆ పిల్ల ఏం అపకారం, అపచారం చేసిందావిడకి??

నా సైకాలజీ స్టడీ అంతా, ఈ విషయంలో నీరుకారి పోయిందనుకున్నాను విస్తుపోతూ.

సృష్టిలో ఒకకాకి, ఒక పిచ్చుక తమ పిల్లలకి తాము తిండిపెట్టుకునే స్వతంత్రం కలిగి వుంటాయి, పాపం ఈ వందనకి ఆ ప్రాప్తం లేదుగదా? ఎంత దురదృష్టం ఆమెది?

పూర్ణిమ నా మంచానికటున్న సరస్వతిదగ్గిరికి వెళ్ళి గుసగుసలాడ్డం గమనించాను. మొదట వాళ్ళ సమాలోచన నాకు బోధపడలేదుగాని, క్రమంగా వాళ్ళ హావభావాలూ, చేష్టలూ నాకేదో చెప్పాయి:

పూర్ణిమ సరస్వతికి, వందన బిడ్డని చేత్తో చూపుతోంది. సరస్వతి వచ్చి వందన కొడుకుని చూసింది. ఆమె వదనం ప్రకాశవంతం అయిందప్పుడు "చందమామలా వున్నాడు. నా అదృష్టం. మీ దయ—" అని సరస్వతి సంతోషంగా అన్నది.

నేను వింటూ ఆలోచిస్తున్నాను.

వందన వాళ్ళిద్దరినీ చూసింది,విస్తుపోయింది. సరస్వతిని వందన, తోడేల్ని మేకపిల్ల తల్లి చూసి నట్టు చూసింది. 'నాపిల్ల-వద్దు వద్దు: కావలిస్తే నన్ను తీస్కో, తినెయ్యి.' అన్నట్టు వందన ముఖంలో భావం చెప్పింది నాకు.

"మీ దయ. నా ప్రాప్తం."

మళ్ళా,మళ్ళా అంది సరస్వతి.

ఆవిడ పరిస్థితి నాకు అవగతం అయింది. ఆవిడకి పురుట్లోనే బిడ్డ చనిపోయింది. అదే మొదటి కానుపు. బలవంతంగా బిడ్డని తీశారు. మళ్ళా కానుపయితే కష్టం అని డాక్టర్లు సరస్వతికి చెప్పేశారు. పిల్లల్నికనే భాగ్యం తనకు లేదని నిస్పృహ చెందిన సరస్వతికి, ఈ పూర్ణిమ మళ్ళా ఆశ కల్పించింది.

సరస్వతీ, ఆమె భర్త పూర్ణిమని కృతజ్ఞతగా వరాలిచ్చే భగవంతుణ్ణి భక్తుడు చూసినట్టు భక్తిగా చూస్తున్నాడు. వుండివుండీ అటెళ్ళి వాళ్ళతో మంతనా లాడుతూనే వుంది పూర్ణిమ.

"మీకే భయంలేదు. మీరేం భయపడనవసరంలేదు: ఆ పూచీనాది. అదేంచెయ్యలేదు మిమ్మల్ని. దానికంత ధైర్యం ఒహటా? దాని మొహం. దానికే గతిలేదు, నేనేంపెడితే అది తినీ, నా ఇంట్లో చచ్చినట్టు పడివుండేది. దానేడుపా? ఎన్నాళ్ళేడుస్తుంది? ఇవాళా, రేపూ."

"... ... ..."

"మీకు బిడ్డ అవసరం, దానికా అవసరం లేదు..." అని తెగేసినట్టే చెప్పింది పూర్ణిమ వాళ్ళతో.


వాళ్ళుముందు తటపటాయించేరు. వందనని చూసి బాధపడ్డారుగాని, మళ్ళా సర్దుకున్నారు.

పూర్ణిమకి వేల కృతజ్ఞతల హారాలు మెళ్ళో వేసేరు.

వార్డు,పురుళ్ళు వార్డులా అనిపించడం లేదు నాకిప్పుడు. యములాళ్ల నివాసంలా కనిపిస్తోంది. వందన ఈ యమసదనంలోకి వచ్చిపడ్డది: ఆ పిల్లని కిరాతకులు రకరకాలుగా పీడించుకు తింటున్నారు.

పూర్ణిమతో నేను మాటలాడ్డం వందన విన్నది.

ఆ మధ్యాహ్నం వందన నెమ్మదిగ, నా దగ్గిరికి వచ్చింది. నాతో తన బాధనీ, దుఃఖాన్నీ



చెప్పుకుందామని వచ్చింది. నేను తన తరపున నిలబడి, పూర్ణిమని ఎదిర్చి, తన బిడ్డని తనకిప్పి స్తానన్న ధైర్యం, ఆశా వందన ముఖంలో దీపాల్లా వెలగడం గమనించేను.

వందన అలా వచ్చి, ''ఏమండీ...'' అంటూ నోరు విప్పింది. వెనకే పూర్ణిమ వచ్చి, వందనే చెయ్యిపట్టుకుని, ఈడ్చుకుపోయినట్టే తీసుకుపోయింది.

వందనని నేను నిస్సహాయంగానూ, పూర్ణిమని క్రూరంగానూ చెరో కంటితో చూడ్డం తప్పితే, నేనేం చేయగలను?

నాకు ఆ ఆవేదనతో నానిస్సహాయతతో వందన దోషిగా పూర్ణిమ హృదయంలో,

ఎలా నిలుచున్నదో అవగతం అవుతోంది:

వందన తప్పుచేసింది.

అక్రమంగా ఆ బిడ్డని కన్నది.

అందుకే ఆమె యజమానురాలయిన పూర్ణిమకి అంత శత్రువయిపోయింది:

తనింటిలో వుంటోన్న ఒక దాసీ పిల్ల అలాంటి నేరం చేస్తే సహించగలదా ఆ యింటి యజమానురాలు??

పూర్ణిమలాంటి స్త్రీ??

వందన నావిడ పూర్తిగా ద్వేషిస్తోంది: ఆ బిడ్డని ఎడం చేసేంత పగబట్టింది.

ఇది మాత్రం నామనస్సు ఒప్పుకోవటం లేదు.

వందన చేసిన నేరానికి మరే విధంగానయినా దండించ వచ్చేమోగాని, ఆ తల్లినించి బిడ్డని ఎడం చేసే హక్కు పూర్ణిమకి లేదుగాక లేదు.

ఆ అధికారం లేదావిడకి:

అంత చెడ్డతనం, క్రౌర్యం పూర్ణిమకెలా ఏర్పడినాయంటే, అదామె స్వభావం అనుకోవాలి::

ఏది ఏమయినా, వందన, ఈ మనుషుల కోర్టులో నిందితురాలు.

### శాపం

జీవితమనే వలయంలో
ప్రతివ్యక్తి సాలెపురుగు

మనిషికి
తీరని ఆశల దాహం
కాదా ఓ పెద్ద శాపం

జీవితానికి
అదేకదా అశాంతి
మరెప్పుడో కదా కాంతి

-రజనీనాథ్

ఆ పిల్లల తరపున తీర్పు చెప్పే జడ్జీ లేదు. వాదించే న్యాయవాదీ లేదు. మరెలా గెలుస్తుంది వందన??

సాయంత్రం మా వారు వచ్చినప్పుడు ఈ కథంతా ఆయనకి చెప్పాను. ''చాలా ఇంట్రెస్టింగా వుందే'' అన్నారు.

''బాధగా లేదా?'' అన్నాను.

ఉలిక్కిపడి ''ఎందుకు లేదూ? చాలా విచారంగా వుంది. పాపం వందన...'' అంటూ అంతలో మూడ్ మారి, నా చెక్కిలి మీద చిటికె. బాబు బుగ్గమీదో ముద్దూ పడేసారు. ''అలా వినండి వాళ్ళ మాటల్ని'' అన్నాను.

అక్కడ-పూర్ణిమ. సరస్వతితో. ఇలా అంటోంది:

''...మనలో మనమాట. పిల్లాడు ఖరీద యిన ఇంటికె వెడుతున్నాడుకదా:''

సరస్వతీ, ఆమె భర్తా ''అవును'' అని నవ్వుతూ తలలూపారు.

''ఖరీదయిన ఇంట్లోకెళ్ళే బిడ్డ, ఖరీదు చెయ్యాలే? ఎంత చేస్తాడంటారు?...'' అని పూర్ణిమ పక పకా, అదంతా ఆలకిస్తోన్న వందన పొలగుండెల్లో బండరాళ్ళు పడేలా నవ్వుతోంది.

''దారుణం''అన్నారాయన.

''ప్చ్. ఎవరికెవరురుణమో? వందనకి ఆమె కొడుక్కు రుణం లేదు కాబోలు. సరస్వతికి వాడికీ వుంది. రుణాలకి సంబంధించిన దారుణం వీళ్ళ కథ.'' అన్నానేను.

వాళ్ళ మాటల శబ్దం మందగించింది.

మాకు వాళ్ళ మోహాలే చెబుతున్నాయి. వాళ్ళు వందన కొడుక్కు ఖరీదు కడ్తున్నారని.

సరస్వతి భర్త ఇంటికి వెళ్ళి వచ్చాడు. ఇప్పడతని చేతిలో ఒక కవరున్నది అది పూర్ణిమకి ఇచ్చేడతను. పూర్ణిమ చాటుకెళ్ళి లెక్క చూసుకుని, పౌర్ణమి చంద్రుడిలా వెలిగే వదనంతో వచ్చింది.

ఇదంతా నాకు తెలుసు నేనూ గమనిస్తున్నాను వాళ్ళ చర్యల్ని. వార్డులో ఎవరూ పట్టించుకోవడం మానివేశారు. పూర్ణిమ నోటికి జడిశారో వెరిచారో మాకెందుకని వూరుకున్నారో? స్టాఫ్ నర్స్ వాళ్ళు కూడా ఏమీ కలగజేసుకోలేదు. పాపం. వందన కేవిధంగాను అండ లేదు.

వందన ఏడ్చుకొంటూనే వుంది.

పూర్ణిమ గదమాయిస్తోనే వుంది.

ఆ రోజు మా మంచాలు మూడూ ఖాళీలవబోతున్నాయి: ముగ్గురమూ ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోతున్నాము.

నేను అనుకోకుండా పూర్ణిమ, భర్త ఒక స్తంభం చాటున మాట్లాడుకొనే ఆ మాటలు వినటం జరిగింది: ఏదో పని వుండీ ఆవైపుగా వెళ్ళి, చటుక్కునాగాను. అతనంటున్నాడు. ''చూశావా? నన్ను తిట్టావుగానీ...నీకేగద లాభం ఇప్పుడు?''

పూర్ణిమ మండిపడ్తూ అందిలా. ''చాల్లే నువ్వు చేసిన పాడుపనికి ఆ గుంటతో నేనెన్ని పాట్లు పడ్డానో? నాకు లాభం అనీ, మళ్ళా గడ్డి కరుస్తావేటి? జాగర్త? ఓ పాతుపాతీగల్ను ఇద్దర్నీ:''

మా బ్యాగుల్తో ఆయన నడుస్తుంటే, వెనక నేను పిల్లాణ్ణెత్తుకుని వెళుతున్నాను.

వందన ఏడుపు నా చెవుల్లో అపశ్రుతి అయి ధ్వనిస్తోంది.

